# ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి అందించడమే లక్ష్యం

## అభివృద్ధికి భవిష్యత్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, మే 23: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా చర్యలు తీసుకోవడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. జిల్లాలో ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించామని, క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి సభ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తో పాటు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణలో భాగంగా 10 అంశాలతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. అధికారులు గ్రామాల వారీగా పర్యటించి ప్రజలతో మమేకమై సమస్యలు, అవసరాలను గుర్తించారని పేర్కొన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో సభలు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, అవగాహన కార్యక్రమాలు, కొత్త ప్రజాప్రతినిధులకు శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తామని, ప్రతి చివరి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు చేరేవరకు చర్యలు కొనసాగిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, గ్రామస్థాయి అభివృద్ధి పనులకు తగిన నిధులు విడుదల చేయాలని కోరారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు ప్రజా పాలన కార్యక్రమం దోహదపడిందన్నారు. అధికారులు ప్రజలతో మమేకమై అనేక సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించారని పేర్కొన్నారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. సుమారు 1500 మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి, 500 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్ మాట్లాడుతూ 66 డివిజన్లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచామని తెలిపారు. కొత్తగా నగరంలో విలీనమైన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాసరెడ్డి, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు, కార్పొరేటర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

### సర్పంచుల సమస్యల పరిష్కారానికి హెల్ప్ డెస్క్

గ్రామాల్లో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. హెల్ప్‌లైన్ నంబర్లను కేటాయించి సర్పంచులకు తెలియజేయాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న గ్రామపంచాయతీ భవనాల జాబితాను సిద్ధం చేసి వాటి పూర్తి కోసం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ చట్టం--2018 ప్రకారం గ్రామపంచాయతీల ఆదాయం--వ్యయాలను పర్యవేక్షిస్తూ సిబ్బంది వేతనాలు, విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించేలా చూడాలని పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు అరికట్టాలి

### ఇప్పటివరకు 40 శాతం వరి ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయలేదు: మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



కరీంనగర్, మే 23: కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 40 శాతం వరి ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ను కలెక్టరేట్‌లో కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ జిల్లాలోని చొప్పదండి, రామడుగు, గంగాధర మండలాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు, తూకాల్లో మోసాలు జరుగుతున్నాయని ఆరోపించారు. గత 45 రోజులుగా లారీల కొరత తీవ్రంగా ఉందని, ప్రభుత్వం మట్టి తరలింపుపై చూపుతున్న శ్రద్ధను ధాన్యం కొనుగోళ్లపై కూడా చూపించాలని సూచించారు. కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యపు సంచులకు చెదలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రతి క్వింటాల్ వడ్లకు 10 కిలోల వరకు తరుగు పేరిట కోతలు విధిస్తూ రైతులను నష్టపరుస్తున్నారని, గతంలో 'ఏ' గ్రేడ్‌గా కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఇప్పుడు 'బి' గ్రేడ్‌గా మార్చి క్వింటాల్‌కు రూ.20 వరకు తగ్గిస్తున్నారని విమర్శించారు. అదనంగా 'తాలు' పేరుతో కూడా కోతలు పెడుతున్నారని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు, హమాలీల కొరత తీవ్రంగా ఉందని, లారీ యజమానులు ప్రతి బస్తాకు రూ.2 చొప్పున అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో దాదాపు 60 శాతం వరి ధాన్యం ఇంకా కొనుగోలు కేంద్రాల్లోనే నిల్వ ఉందని, వర్షాలు కురిసే అవకాశాల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వెంటనే మట్టి తరలింపు లారీలను ధాన్యం రవాణాకు మళ్లించి, యుద్ధప్రాతిపదికన ధాన్యాన్ని తూకం వేసి మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్‌లు పొన్నం అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల సమస్యలు పరిష్కరించాలి: బీజేపీ




కరీంనగర్, మే 23: వడ్లు, మొక్కజొన్న పంటలను తక్షణం కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించడం, కొనుగోళ్లు మందగమనంగా సాగడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని కూడా బి గ్రేడ్‌గా మార్చి తాలు, తరుగు పేరిట కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు, కూలీలు, రవాణా సౌకర్యాల కొరత ఉందని పేర్కొన్నారు. రైతుల నుంచి వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తాలు, తరుగు కోతలను నిలిపివేసి, తగిన లారీలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలని కోరారు. అనంతరం సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలి




రాజన్న సిరిసిల్ల, మే 22: కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని క్యాబినెట్ సెక్రటరీ (కోఆర్డినేషన్) సెంట్రల్ సెక్రటేరియట్ అధికారులను ఆదేశించారు. రైల్వే లైన్ నిర్మాణ పనులు, భూ సేకరణ, ఇతర అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశ్రమల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పురోగతి, భూ సేకరణ స్థితిగతులు, పెండింగ్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. పనుల్లో జాప్యం లేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు రాజేందర్ రెడ్డి, కెఎస్‌బీ కుమారి, ఇండస్ట్రీస్ జీఎం హనుమంతు, జిల్లా ఖజానా శాఖ అధికారి నవీన్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వస్తువులపై ధరల ముద్రణ కోసం దేశవ్యాప్త ఉద్యమం

### ఎమ్మార్పీ నియంత్రణ చట్టం తీసుకురావాలి: ఏబీజీపీ నేతలు



కరీంనగర్, మే 23: మాక్సిమమ్ రిటైల్ ప్రైస్ (ఎమ్మార్పీ) ప్రస్తుతం వినియోగదారుల రక్షణ సాధనంగా కాకుండా మార్కెటింగ్, ధరల మోసాలకు సాధనంగా మారిందని అఖిల భారతీయ గ్రహక్ పంచాయతీ (ఏబీజీపీ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగమల్ల సురేష్, జిల్లా అధ్యక్షుడు నలువాల రాజేందర్, జిల్లా కార్యదర్శి సురభి శ్రీధర్ పేర్కొన్నారు. వినియోగదారులకు జరుగుతున్న మోసాలపై ఏబీజీపీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీలు తమ ఇష్టానుసారం అధిక ఎమ్మార్పీలు నిర్ణయించి, తర్వాత భారీ డిస్కౌంట్ల పేరుతో వినియోగదారులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. తయారీ ఖర్చుతో పోలిస్తే వస్తువుల ధరలు అనేక రెట్లు పెంచుతున్నారని పేర్కొన్నారు. ఆన్‌లైన్, మాల్స్‌లలో ఒకే వస్తువుకు భారీ ధర తేడాలు కనిపిస్తున్నాయని తెలిపారు. వినియోగదారులకు అసలు ధర, లాభం, సరైన విలువపై స్పష్టత లేకపోవడంతో దేశవ్యాప్తంగా చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా వారు ప్రధానంగా పలు డిమాండ్లు చేశారు. ఎమ్మార్పీపై గరిష్ట పరిమితి నిర్ణయించే చట్టం తీసుకురావాలని, ఉత్పత్తిపై తయారీ ఖర్చు, జీఎస్టీ చెల్లించిన మొదటి అమ్మకపు ధరను తప్పనిసరిగా ముద్రించాలని కోరారు. మోసపూరిత డిస్కౌంట్లపై నిషేధం విధించాలని, ఎమ్మార్పీ దుర్వినియోగాన్ని నియంత్రించేందుకు స్వతంత్ర కమిషన్ లేదా అథారిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉల్లంఘనలకు కఠిన శిక్షలు విధించేలా చట్ట సవరణలు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# దైనందిన జీవితంలో యోగ భాగం కావాలి





### మెడిటేషన్ ఒక మెడికేషన్ లాంటిది: వెంకట రమణారావు

కరీంనగర్, మే 20: ప్రతి వ్యక్తి దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని హార్ట్ ఫుల్ నెస్ జోనల్ కోఆర్డినేటర్ వెంకట రమణారావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పతంజలి యోగ సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, శ్రీ రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 30 రోజుల కౌంట్‌డౌన్ కార్యక్రమాన్ని నగరంలోని శ్రీ రామచంద్ర మిషన్ ఆశ్రమంలో శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట రమణారావు మాట్లాడుతూ మెడిటేషన్ ఒక మెడికేషన్ లాంటిదని పేర్కొన్నారు. ప్రస్తుతం మానవులు అనేక రకాల సమస్యలతో సతమతమవుతున్నారని, యోగాసనాలు, ధ్యానం మనిషిని ఆరోగ్యవంతంగా ఉంచుతూ మనసులో ధైర్యం, మనోస్థైర్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. యువభారత్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల రమేష్ మాట్లాడుతూ యోగా అనేది వ్యక్తిని మాత్రమే కాకుండా వ్యవస్థను సమూలంగా మార్చే ప్రక్రియ అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి యోగాను చేరవేయాలనే ఉద్దేశంతో ఉచిత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామచంద్ర మిషన్ సెంటర్ కోఆర్డినేటర్ సుధాకర్, సెంటర్ బాధ్యులు ఉజ్వల, సత్యనారాయణ, శంకరయ్య, పతంజలి యోగ సమితి బాధ్యులు నాగమణి, శ్రీలత, శంకర్‌తో పాటు అనేక మంది యోగ సాధకులు పాల్గొన్నారు.

# మాడిశెట్టి దంపతుల సేవా కార్యక్రమాలు

### పెళ్లిరోజు సందర్భంగా మజ్జిగ పంపిణీ, చీరల అందజేత



కరీంనగర్, మే 23: ప్రముఖ కవి, రచయిత, వ్యాఖ్యాత మాడిశెట్టి గోపాల్, ఉమాదేవి దంపతులు తమ పెళ్లిరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భగత్‌నగర్‌లోని భగత్ సింగ్ విగ్రహం వద్ద ఎమ్మార్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చిట్టుమల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక సీతారాంపూర్ స్లమ్ ప్రాంతంలో వాసవి వాగ్దేవి క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ నిర్వహించారు. సుమారు 40 మంది మహిళలకు చీరలు అందజేశారు. చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రీజన్ చైర్‌పర్సన్ సూర గీత, క్లబ్ అధ్యక్షురాలు గంపహరిని, కార్యదర్శి కే విశాల, ట్రెజరర్ సమత తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com